విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 31 మే 2025   8 పేజీలు

మల్టీ"ఫుల్" దోపిడీ

- సినిమా థియేటర్లలో ధరాభారాలు
- పండుగపూట మరింత దోపిడీ
- సగటు ప్రేక్షకుడి జేబుకు చిల్లులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న తనిఖీలు

రోజువారి పని ఒత్తిడి నేపథ్యంలో జనం కాస్త ఉపశమనం పొందే వాటిలో సినిమాలు ఒకటి.రెండున్నర గంటల పాటు తమ ఒత్తిడిని దూరం చేసుకుని ప్రశాంతంగా ఉండేందుకు సినిమాను ప్రేక్షకులు ఎంచుకుంటారు. కుటుంబంతో సరదాగా గడిపేందుకు సినిమా ఉపయోగపడుతోంది. అలాంటి సినిమా నేడు వ్యాపారంగా మారింది. మల్టీప్లెక్స్ సినిమాల రాకతో థియేటర్ల స్వరూపమే మారిపోయింది. అధిక ధరలతో ప్రేక్షకుడిని నిట్ట నిలువునా దోపిడీ చేస్తున్నారు. టికెట్ ధర నుంచి తినుబండారాల వరకు అన్నింటి ధరను రెండు, మూడు రెట్లు పెంచి ప్రేక్షకుడికి సినిమా చూపిస్తూ మల్టీ"ఫుల్"గా దోపిడీ చేస్తున్నారు.

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని పట్టణ ప్రాంతాల్లో మల్టీప్లెక్స్ థియేటర్లు ఉన్నాయి. ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, నూజివీడు ప్రాంతాల్లో మల్టీప్లెక్స్ థియేటర్లు ఉన్నాయి. గత దశాబ్ధం క్రితం వరకు సాధారణ థియేటర్లుగా ఉన్న వాటిని కార్పొరేట్ వ్యక్తులు లీజుకు తీసుకుని వాటిని మల్టీ ఫ్లెక్స్ లుగా మార్చేశారు. థియేటర్ కు అందమైన రంగులు అద్ది కార్పొరేట్ హంగును తీసుకుని వచ్చారు. థియేటర్లు కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన తర్వాత ఒక్కసారిగా దాని స్వరూపమే మారి పోయింది. ముఖ్యంగా అందులో ప్రదర్శించే సినిమా టికెట్ల ధర,అక్కడ అమ్మే తినుబండారాల ధరలుఆకాశాన్నంటుతున్నాయి.నలుగురు కుటుంబ సభ్యులున్న వారు సినిమాకు వెళ్లాలంటే రూ.1500 నుంచి రూ.2వేల వరకు వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.పెద్ద హీరోలు నటించిన సినిమాలు విడుదలైన మొదటి వారం వరకు టికెట్ ధర రూ.600 వరకు నడుస్తోంది. సినిమా బాగుం దని ప్రచారంలోకి వస్తే ఈ ధరను మరింత పెంచుతున్నారు. రెండు,మూడు రోజుల్లోనే సినిమా నిర్మాణానికి పెట్టిన పెట్టుబడులు మొత్తం రాబట్టు కునేలా ధరలను పెంచేస్తున్నారు. థియేటర్లలో తినుబండారాలు ఆకాశాన్నంటు తున్నాయి. బయట దొరికే వస్తువులనే ధరలు నాలుగు రెట్లు ధరలు పెంచి అమ్ముతున్నారు.బయట రూ.10 కి దొరికే పాప్‌కార్న్ రూ.50 నుంచి రూ.100, రూ.10 కూల్ డ్రింక్ ను రూ.50, రూ.10 విలువ చేసే సమోసా రూ.40, రూ.20 వాటర్ బాటిల్ రూ.40 ఇలా అన్నింటి ధరలను ▶మిగతా 2లో..

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

- జూలై 15,16 తేదీల్లో సామర్లకోటలో సీపీఐ జిల్లా మహాసభలు
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు

విశాలాంధ్ర - సామర్లకోట : భారత కమ్యూనిస్టు పార్టీ కాకినాడ జిల్లా ద్వితీయ మహాసభలు జూలై 15, 16 తేదీలలో సామర్లకోటలో నిర్వహించ నున్నట్టు సీపీఐ జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు వెల్లడించారు. శుక్రవారం స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో జిల్లా మహాసభల విజయ వంతానికి జిల్లా విస్తృత సమావేశం పి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఇటీవల మరణించిన మృతవీరులకు రెండు నిమిషాల పాటు సంతాపం తెలిపారు. అనంతరం తాటిపాక మధు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహాసభల కాలం ప్రారంభమైందని ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శాఖ ▶మిగతా 2లో..

నేడే పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-ఏలూరు: ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం అందించే జూన్ నెల పింఛన్ లను ఈనెల 31నే లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. జూన్ 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. జూన్ నెల పింఛన్ల పంపిణీ ఈనెల,31 వ తేదీ ఉదయం గం.7లకల్లా ప్రారంభించాలన్నారు.ఈనెల 31 వ తేదీన ఫించన్లు ఏదైనా కారణం చేత తీసుకోని వారికి జూన్ 2వతేదీన పంపిణీ చేస్తారన్నారు. పింఛన్లు ముందస్తు పంపిణీ విషయాన్ని లబ్దిదారులకు వ్యక్తిగతంగా తెలియజేయాలని కలెక్టర్ ▶మిగతా 2లో..

కనీస వేతనం రూ.26 వేలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ అండ్ సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో శుక్రవారం సెక్యూరిటీ గార్డ్ సమస్యలను పరిష్కరించాలని, బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరిం టెండెంటుకు వినతిపత్రం అంద జేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డ్స్ పెంచిన బకాయి జీతాలు 7 నెలలుగా చెల్లించలేదని, బకాయి జీతాలు, పిఎఫ్, ఈఎస్ఐ పూర్తిస్థాయిలో చెల్లించాలని, రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు 26 వేల రూపాయలు మంజూరు చేయాలని అన్నారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, విశాఖ జిల్లా నుండి సుమారు రోజుకి 4,000 మంది పైనే వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి వస్తూ ఉంటారని, వారందరికీ, వైద్యం అందించే డాక్టర్లకు రక్షణగా సెక్యూ రిటీ గార్డ్స్ పనిచేస్తున్నారని తెలిపారు. వారిపై అనేక సార్లు దాడులు జరుగు తున్నా భరిస్తూ జీవనం కొనసాగిస్తున్నారని, సెక్యూరిటీ గార్డ్స్‌ను తక్షణమే పర్మనెంట్ చేయాలని ప్రసాద్ అన్నారు. కొత్త ▶మిగతా 2లో..

1 నుంచి నీరు విడుదల

కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లాలో ఖరీఫ్-2025 పంటకు విత్తనాలు వేసుకునేందుకు గోదావరి ఈస్ట్రన్ డెల్టాకు కాకినాడ కెనాల్, సామర్లకోట కెనాల్, బ్యాంక్ కెనాల్‌కు జూన్ 1వ తేదీ నుంచి రోజుకు 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయనున్నట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్ట్రన్ డెల్టాలో రైతులు త్వరిత గతిన విత్తనాలు వేసుకునేందుకు జూన్ 1 తేదీ నుండి నీటిని విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. పురుషోత్తంపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ నుండి జూలై మొదటి వారంలోనూ, ఏలేరు రిజర్వాయర్ నుండి జూలై మొదటివారంలోనూ, పంపా రిజర్వాయర్ నుండి ఆగస్టు మొదటి వారంలోనూ నీటిని విడుదల చేయనున్నట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. నీటి విడుదల సమయాలనుబట్టి రైతులు ఖరీఫ్ 2025 పంటను సాగు చేసుకునేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి సూచించారు.

కూలిన పాఠశాల పైకప్పు

సెలవులు కావడంతో తప్పిన పెనుప్రమాదం

విశాలాంధ్ర-భీమడోలు: మండలంలోని పాలసానిపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల

తరగతి గదిలో భవనం పైకప్పు కుప్పకూలింది. వేసవి సెలవులు కావడంతో ఆ తరగతి గదుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా తరగతి గదుల ▶మిగతా 2లో..

2న ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఆచంట: జిల్లాలో అర్హులైన పేదలందరికీ పట్టణాలలో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇంటి స్థలం కేటాయించాలని, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న జిల్లాలోని అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని శేషమ్మ చెరువు గ్రామంలో సిపిఐ ఆచంట, పోడూరు మండలాలకు చెందిన ముఖ్యుల సమావేశం సిపిఐ నాయకులు జక్కంశెట్టి ▶మిగతా 2లో..

లంకా దినకర్ నేడు ఏలూరు రాక

విశాలాంధ్ర -ఏలూరు: 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ శనివారం ఉదయం గం.8.30లకు ఏలూరు రెవిన్యూ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. ఉదయం గం.10.30లకు స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మంది రంలో 20 సూత్రాల కార్యక్రమం అమలుపై అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం గం.2.30లకు పాత్రికేయుల సమా వేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం గం.3లకు భోజన అనంతరం సా. గం.4నుండి 5 గం. వరకు స్థానిక కూటమి నాయకులతో సమావేశం అవుతారు. సాయంత్రం గం. 6లకు ఏలూరు నుండి బయలుదేరి విజయవాడ వెళతారు.

జయప్రదం చేయండి (1వ పేజీ తరువాయి)

సీతారామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోనాల భీమారావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఇల్లు లేని పేదలకు పట్టణాలలో ఒక సెంటు,గ్రామాలలో సెంటున్నర స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇచ్చిందన్నారు. ప్రజా ఆమోగ్యం లేని ప్రాంతాలలో కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడం ద్వారా ఇల్లు పూర్తి చేసుకోలేక లక్షలాదిమంది పేద ప్రజలు ఇంటి నిర్మాణం చేపట్టలేదని గుర్తు చేశారు. అనేకమంది అప్పులు చేసి నిర్మాణాలు చేసుకున్నారని తెలిపారు. నాటి నుంచి సిపిఐ ఆధ్వర్యంలో పట్టణాలలో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో 3సెంట్లు,ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని ఆందోళనలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని పేదలందరికీ పట్టణాలలో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు,ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని,కానీ అధికారం చేపట్టి సంవత్సరం కావస్తున్నా ఆ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో సిపిఐ ఆధ్వర్యంలో అర్హులైన పేదల నుంచి అర్జీలు స్వీకరించి తహసీల్దార్ కార్యాలయాలలో,సచివాలయాలలో అందజేసినట్టు తెలిపారు. ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదని ఇచ్చిన అర్జీలను పరిశీలించి అర్హులకు ఇంటి స్థలం కేటాయించేందుకు ముందుకు రాకపోవడంతో జూన్ 2న జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ ధర్నాలో జిల్లాలోని ఇళ్ల స్థలాలకు అర్హులైన పేదలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐరాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు, బందారు నాగేశ్వర రావు, చిట్టూరి వెంకట సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పైకప్పు (1వ పేజీ తరువాయి)

పైకప్పు కూలిపోయింది. భారీ వర్షం రావడంతో పాటు ఆ ప్రాంతంలో దుమ్ము రేగడంతో సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. పై కప్పు కూలిన తరగతి గదుల్లో సైన్స్ ల్యాబు నిర్వహిస్తున్నారు.దీంతో సైన్సు పరికరాలు కంప్యూటర్లు ధ్వంసం అయ్యాయి. ఇదే ప్రాంగణంలో శుక్రవారం నుంచి గురుకుల పాఠశాల జోన్ 2 స్థాయి ఉపాధ్యాయుల అధ్యాపకుల కౌన్సెలింగ్ జరిగింది. పై కప్పు పై రోజుల తరబడి వర్షం నీరు నిలిచిపోవడం వల్ల లేదా నాణ్యత లోపం వల్ల కూలిపోయిందో తెలియాల్సి ఉంది.

ఏలూరు నగరపాలక సంస్థ

సీల్డ్ టెండర్ కమ్ పబ్లిక్ ఆక్షన్ నోటీసు

ఆర్.ఓ.సి.నెం.4041/2024/21 తేదీ: 29-5-2025

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోగల ఈ దిగువ ఉదహరించిన వివిధ మున్సిపల్ కాంప్లెక్స్ లోని ఖాళీగా ఉన్న షాపు రూములు బహిరంగవేలము కేటాయించుటకుగాను ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 56, తేది. 05-02-2011 మరియు ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 198, తేది. 08-05-2012 నందలి నిబంధనలు మరియు పశ్చిమగోదావరి జిల్లా గెజిట్ సప్లిమెంటు సంఖ్య 76, తేది.23-08-2014 ప్రకారము ది.09-06-2025, సోమవారము ఉదయము గం.11.00 నుండి ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయము ఆవరణ యందు సీల్డ్ టెండర్ కమ్ ద్వారా పబ్లిక్ ఆక్షన్ నిర్వహించబడును.

అద్దె ప్రాతిపదికపై కేటాయించుటకు:

వంగాయగూడెం చేపల చెట్టు మార్కెట్-8, బాపూజీ కాంప్లెక్స్-2, కందుల సూర్యం కాంప్లెక్స్-FF-1, పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు North FF-3, పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు South GF-1, పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు South FF-5, పాండురంగా కాంప్లెక్స్ 'B' బ్లాకు South GF-6, కాటిల్ డిపో FF-3, కస్తూరిబా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ II-1, మెయిన్ ఫిష్ మార్కెట్-21, గజ్జలవారి చెరువు బుద్ధా పార్క్-22, ఆదివారపు పేట మార్కెట్ కాంప్లెక్స్-4,16(SC), పోడిదిబ్బ కాంప్లెక్స్-1, ASR 'C' బ్లాక్ GF-4, న్యూ ఫిష్ మార్కెట్-12, సీల్డ్ టెండర్స్ కోరడమైనది. కస్తూరిబా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ II-1, ఉమెన్ & చైల్డ్ GF-1 షాపులను బహిరంగ వేలము నిర్వహించబడును. నగరపాలక సంస్థ వారు షాపుల వారీగా నిర్ణయించిన సాంవత్సరిక అద్దెకు 10 శాతము ధరావత్తుగా చెల్లించవలయును. సాల్వెన్సీ-రూ.1,00,000/-.

గుడ్‌విల్ పద్ధతిపై కేటాయించుటకు:

1. ఆదివారపు పేట మార్కెట్ కాంప్లెక్స్-13,, గుడ్ విల్ రూ.25,000/-, 2. లావేటి అప్పల స్వామి మార్కెట్-14, గుడ్ విల్ రూ.25,000/- సాల్వెన్సీ-రూ.1,00,000/- 3. మెయిన్ ఫిష్ మార్కెట్-76 నెంబరునకు గుడ్‌విల్ రూ.1,45,000/-, మెయిన్ ఫిష్ మార్కెట్- 87 (SC) గుడ్‌విల్ రూ.1,00,000/-, సాల్వెన్సీ-రూ.1,50,000/-.

ఇతర వివరములకు ఆఫీసు పని వేళలలో అడిగి తెలుసుకొనగలరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : 7013187783, 9849907144, 9492974794.

కమీషనర్, నగరపాలక సంస్థ, ఏలూరు

పించన్ల పంపిణీ (1వ పేజీ తరువాయి)

సూచించారు. జిల్లాలో జూన్ నెల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు సంబంధించి 2,58,804 మంది ఫించన్ దారులకు రూ. 113.00కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వీలైనంతవరకు ఈనెల 31వ తేదీనే నూరుశాతం పంపిణీ పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఫించన్ పంపిణీకి నిర్దేశించిన 5253 మంది సిబ్బంది తప్పకుండా ఈనెల 31వతేదీ ఉదయం గం.7లకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఫించన్ పంపిణీలో ఎక్కడైనా ఏ ఒక్క పొరపాటు జరగకుండా ఫించన్లు పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. .జిల్లాలో స్పౌస్ పెన్షన్ల కింద మంజూరైన 2,967 పెన్షన్ల ను జూన్ 12వ తేదీన ప్రత్యేక కార్యక్రమం ద్వారా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. జూన్ నెల పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు,జిల్లా పరిషత్ సి.ఇ.ఓ, భీమేశ్వరరావు,జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి. నీలాద్రి, జిల్లా పంచాయతీ అధికారి కె. అనురాధలను కలెక్టర్ ఆదేశించారు.

మంజూరు చేయాలి (1వ పేజీ తరువాయి)

కాంట్రాక్టర్ ద్వారా సెక్యూరిటీ గార్డ్స్ కనీస వేతనాలు 26 వేల రూపాయలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సెక్యూరిటీ గార్డ్ కాంట్రాక్టర్ వారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కెవి రామయ్య, ప్రధాన కార్యదర్శి ఎన్. అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ మందపల్లి జాన్ బాబు, కోశాధికారి డి. మధు, వి. శ్రీనివాసరావు, కె. వెంకటేష్, పి. రమణమ్మ, ఏ. లవ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

పోరాటం (1వ పేజీ తరువాయి)

మహాసభలు పూర్తిచేసుకుని జూలై 15, 16కు జిల్లా మహాసభలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా అర్బన్లో రెండు సెంట్లు, రూరల్‌లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇప్పటికే సిపిఐ ఆరు నెలలుగా పలు దశల్లో ఉద్యమాలు నిర్వహించిందన్నారు. ఆయా దరఖాస్తులు తహసీల్దార్లకు, జిల్లా కలెక్టరుకు అందజేశామని, అయినా పేదవాడికి ఇల్లు ఇవ్వడంలో చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తున్నదని ఆయన విమర్శించారు. సూపర్ 6 హామీలు కూడా ఇప్పటికీ అమలు చేయలేదని ఆయన తెలిపారు. కాకినాడ జిల్లాలో ఇసుక, మట్టి అవినీతి వ్యాపారం జోరుగా సాగుతుందని, దీనిపై పలు ఫిర్యాదులు చేసినా స్పందించే నేతలు కరువయ్యారని ఆయన విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె. బోడకొండ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో అనేక ప్రజా సమస్యలు నెలకొని ఉన్నాయని, ముఖ్యంగా యు కొత్తపల్లి మండలం కొమరగిరి లేఔట్‌లో సిపిఐ దరఖాస్తు చేసిన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పిఠాపురం నియోజకవర్గ కార్యదర్శి కేశవరపు, అప్పలరాజు, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎ. భవాని, పెద్దాపురం పట్టణ కార్యదర్శి రామకృష్ణ, కార్మిక నాయకులు కిషోర్, ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ మడగల రమణ, పెదిరెడ్ల అర్జున్‌రావు, సప్పు సూరిబాబు, అల్లూరి భద్రం, శివాజీ, పి రాజేశ్వరరావు, ఎస్. శంకర్, రమణ తదితరులు ప్రసంగించారు.

దోపిడీ (1వ పేజీ తరువాయి)

పెంచి ప్రేక్షకుడి నడ్డి విరుస్తున్నారు. సినిమా హాల్లో ద్విచక్ర వాహనం నిలపాలంటే రూ.20, కారుకు రూ.50 వసూలు చేస్తున్నారు.

పండుగ రోజులలో అదనపు ధరలు

పండుగ సీజన్‌లో సాధారణంగా కొత్త సినిమాలు ఎక్కువగా విడుదలవుతుంటాయి. ఈ సమయంలో ప్రజలకు సెలవులు ఉండటంతో చాలామంది సినిమాను చూసేందుకు ఇష్టపడతారు. దీనిని అదునుగా చేసుకొని మల్టీప్లెక్స్ నిర్వాహకులు ధరలను పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఆ రోజులలో సినిమా టికెట్ ధరలను అమాంతం పెంచేస్తున్నారు.

సౌకర్యాలు నిల్

మల్టీప్లెక్స్ యాజమాన్యాలు ప్రేక్షకుల నుంచి ముక్కు పిండి ధరలు వసూలు చేస్తున్నా వసతులు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. థియేటర్ల మరుగుదొడ్లు కనీస శుభ్రత పాటించడం లేదు. నీటి వసతి అంతంతమాత్రంగానే ఉంటోంది. వారానికి ఒకసారి కూడా మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న దాఖలాలు లేవు. ఇక పార్కింగ్ రుసుం రూ.20నుంచి రూ.100వరకు వసూలు చేస్తున్నా వాహనాలు నిలిపేందుకు నీడను ఏర్పాటు చేయడం లేదు. సినిమా థియేటర్లకు ఆనుకుని ఆరు బయట ఎండకే వాహనాలను నిలపాల్సిన పరిస్థితి ఉంది.

సినిమా థియేటర్లలో తనిఖీలు

సినిమా థియేటర్లలో జరుగుతున్న అధిక ధరలపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బుధ, గురు, శుక్రవారాలలో రెవిన్యూ అధికారులు తనిఖీ చేసి వాస్తవాలను గుర్తించారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు తిను బండారాల ధరలను అడిగి తెలుసుకున్నారు.సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు,ఆహార వస్తువుల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.చాలా థియేటర్లలో సౌకర్యాలు లేవని, నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించారు.నిబంధనలు పాటించని థియేటర్ల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తినుబండారాల ధరల వివరాలను ఖచ్చితంగా బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే సినిమా థియేటర్ల నిర్వహణ కొనసాగాలని ఆదేశించారు.

సినిమా షూటింగ్ సందడి

ధర్మాజీగూడెం, భోగోలు నరసన్నపాలెంలో సినిమా చిత్రీకరణ

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. వెంకట్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను లింగపాలెం మండలం లోని ధర్మాజీగూడెం, నరసన్నపాలెం, భోగోలులో చిత్రీకరిస్తు న్నారు.

కొన్ని రోజుల పాటు ఈ ప్రాంతంలోనే షూటింగ్ జరుగు తుందని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.ఈచిత్రంలో ప్రముఖ సినీ,బుల్లితెర నటి ఆమని తల్లి పాత్రలో నటిస్తుంది. ధర్మాజీ గూడెంలోని ముసునూరు రెడ్డియ్య నివాసంలో తల్లి పాత్రలో నటిస్తున్న ఆమని, జమిందార్ పాత్రలో నటిస్తున్న శ్రీనివాస్ భోగిరెడ్డి మరి కొందరిపై కొన్ని సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఈప్రాంతంలో సినిమా షూటింగ్ జరుగుతుండటంతో పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తిలకిస్తున్నారు. ఏలూరుకు చెందిన జుత్తిగ వెంకట్ దర్శకత్వంలో హర్రర్ థ్రిల్లర్ సినిమాను సిద్ధ ధాత్రి క్రియేషన్స్ నిర్మిస్తు న్నారు. చిత్రానికి పేరు పెట్టాల్సి ఉందని కో డైరెక్టర్ తెలిపారు.1990 నాటి చిత్రకథ కావడంతో గ్రామీణ ప్రాంతాలలో చిత్రాన్ని చిత్రీకరిస్తున్నట్లు వీరు తెలిపారు. ఈ చిత్రాన్ని ఒట్టి శ్యామ్ నిర్మిస్తున్నారు. హీరోగా ఏలూరుకు చెందిన రమేష్, హీరోయిన్‌గా ఆలమూరుకు చెందిన దివి నటిస్తున్నారు. వీరికి ఇదే తొలి చిత్రం. కథ, పాటలు డైరెక్టర్ వెంకట్ రాశారు. 15మంది తారాగణం షూటింగులో పాల్గొని ఈ ప్రాంతంలో సందడి చేస్తున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర -భీమవరం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పుట్టినరోజు వేడుకలను మల్టీప్లెక్స్‌లోని శ్రీరామరాజు కళ్యాణ వేదికలో శుక్రవారం

ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఎమ్మెల్యే అభిమానులు బంధుమిత్రులు జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, అధికారులు, ఉద్యోగులు వెల్లువలా తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజసేవ కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం ప్రతిఒక్కరి నైతిక బాధ్యత అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగులకు నూతన వస్త్రాలు, దుప్పట్లను ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు పులపర్తి ప్రశాంత్, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర - నిడమర్రు: మండలంలో చౌకడిపో డీలర్లు రేషన్ కార్డుదారులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా సకాలంలో నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని నిడమర్రు తహసీల్దార్ ఎన్.నాగరాజు అన్నారు. తహశీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడమర్రు మండలంలో ఉన్న 31 చౌక



డిపోల్లోని 15,178 రేషన్ కార్డుదారులకు జూన్ నెల నుండి ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపుల వద్ద డీలర్లు అందుబాటులో వుండి ప్రజలకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని కోరారు. వృద్ధులకు, వికలాంగులకు ప్రతీ నెల 5వ తేదీ లోపుగా డోర్ డెలివరి చేయాలని, రేషన్ కార్డుదారులకు ఏవిధమైన అసౌకర్యం లేకుండా నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ జరీనా బేగం, రెవిన్యూ సిబ్బంది రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.

మల్లుల అనురాధ మృతి పార్టీకి తీరనిలోటు : సీపీఐ

విశాలాంధ్ర -భీమవరం: సీపీఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు భార్య, అరసం జిల్లా సమితి సభ్యురాలు, న్యాయవాది మల్లుల అనురాధ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనురాధ సిపిఐ సభ్యురాలుగా, అరసం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ సభ్యురాలుగా ఉంటూ ఆయా సంఘాల్లో క్రియాశీలపాత్ర పోషిస్తూ తన వంతు సహకారాన్ని అందించడంలో ముందుండేవారు. భర్త శ్రీనివాసరావు సహకారంతో ప్రతీ కార్యక్రమానికి అనురాధ వామపక్ష భావజాలంతో అనేక కార్యక్రమాల్లో పాల్గొని ముందుండేవారు. మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు, జిల్లా మహాసభల సందర్భంలో మహిళా నాయకులు ఆమెను కలిసినప్పుడు సహకారం అందించేవారు. అనురాధ మరణం కమ్యూనిస్టు పార్టీకి, అరసం, మహిళా సమాఖ్యకు తీరనిలోటని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

ఆమె మృతి చెందిన వార్త తెలిసిన వెంటనే సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్ వారి నివాసంకు వెళ్లి మల్లుల కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతి తెలిపి ఆమె భౌతిక కాయంపై పార్టీ జెండాను కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీనివాస్, తిరుమాని కామేశ్వరరావు, పార్టీ నాయకులు కోన గొల్లయ్య, నాగిడి శాంతమూర్తి, అరసం జిల్లా అధ్యక్షులు వేల్పుల నాగేశ్వరరావు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించి మల్లుల కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు.

సీపీఐ జిల్లా సమితి సంతాపం

కామ్రేడ్ మల్లుల శ్రీనివాస్ జీవిత భాగస్వామి అనురాధ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, చిన్న వయసులోనే మృతి చెందడం జీర్ణించుకోలేనిదని అనురాధ మృతికి సీపీఐ జిల్లా కోనాల భీమారావు సమితి తరపున తీవ్ర సంతాపాన్ని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు నెక్కంటి సుబ్బారావు ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఏ.పి.మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, జిల్లా కార్యదర్శి సికిలే పుష్ప కుమారి జిల్లా సమితి తరపున ఆమె మృతికి సంతాపం తెలిపి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి సంతాపం

ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్య, చేతివృత్తుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, అరసం రాష్ట్ర కార్యదర్శి బి.ఎన్.సాగర్, చాంద్ బాషా అనురాధ మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పట్టణ సమితి సంతాపం

మల్లుల అనురాధ మృతి ఎంతో బాధాకరమని చిన్న వయసులోనే ఆమె మృతి చెందడం దురదృష్టమని సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు అన్నారు. ఆమె మృతికి సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, నాయకులు నీలాపు శ్రీను, రెల్ల రాము, ధనాల విశ్వనాధ్, మాడుగుల రవికుమార్, పీరుబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.వి.ఆనంద్, సిపిఐ నాయకులు ఎం.లక్ష్మీపతి, ఛాన్ భాష తమ సంతాపం తెలిపారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర -భీమవరం: మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో కోర్టు సముదాయంలో జూలై 7వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మి నారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీకాదగ్గ క్రిమినల్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనోవర్తి కేసులు, గృహహింస కేసులు, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ మొండి బాకీ కేసులు తదితర కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. సివిల్ కేసు రాజీ పడితే అప్పటికే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటే అది అంతిమ తీర్పు కాబట్టి అప్పీలు చేసుకునే అవకాశం ఉండదన్నారు. న్యాయవాదులు, పోలీసు అధికా రులు కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్ గురించి విస్తృతంగా అవగాహన కల్పించి ఎక్కువ కేసుల రాజీకి కృషి చేయ వలసిందిగా ఆయన కోరారు.

గరుడపక్షి నగర్ సీపీఐ శాఖా కార్యదర్శిగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: గరుడపక్షినగర్ సిపిఐ శాఖా కార్యదర్శిగా చిలంతరాజుల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. సభ్యులుగా సుంకర రాధాకృష్ణ, పామర్తి నాగరాజు, చిలంతరాజుల లక్ష్మీ, కన్నా లక్ష్మీ నరమామిడి హనుమంతు ఎన్నిక య్యారు. జంగారెడ్డిగూడెం సిపిఐ మండల కార్యదర్శి జంపన వెంకట రమణరాజు సమక్షంలో ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రమణరాజు మాట్లాడుతూ సిపిఐ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు.

సీపీఐ మండల నూతన కార్యవర్గం

కార్యదర్శిగా కొన్నె లక్ష్మయ్య, సహాయ కార్యదర్శిగా బాబురావు

విశాలాంధ్ర - కుక్కునూరు: ఈ నెల 29వ తేదీన మండల కేంద్రంలో జరిగిన సీపీఐ కుక్కునూరు 16వ మండల మహాసభలో సీపీఐ కుక్కునూరు మండల సమితి నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. 9 మంది సభ్యు లతో కూడిన మండల సమితిని ఎన్నుకున్నారు. కుక్కునూరు మండల సమితి నూతన కార్యదర్శిగా కొన్నె లక్ష్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా కూరాకుల బాబురావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొన్నె లక్ష్మయ్య

మాట్లాడుతూ ఏజెన్సీలో సీపీఐని బలోపేతం చేసి పేదలు, గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. పార్టీని మరింత పటిష్టం చేసి తనకు అప్పగించిన పదవికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తానని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మైసాక్షి వెంకటా చారి, జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్ బాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షు రాలు వరకా శ్యామల, వరసా పాపారావు, మడిపల్లి రమణయ్య, సోడే. నగేష్, ఎకో సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి వితరణ

విశాలాంధ్ర -భీమవరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరంలోని అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ మండలంలో 18 నెలల పాపకు బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం దాతల సహకారంతో రూ. 20 వేలు ఎమ్మెల్యే, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పులపర్తి ప్రశాంత్ అందించారు. పట్టణానికి చెందిన రఫీ, ఆఫీయ దంపతుల 18 నెలల హప్సా అనే పాప అనారోగ్యం తో బాధపడుతుంది. దాత భీమవరపు పెద్దిరాజు పాప ఆపరేషన్ నిమిత్తం రూ.20 వేలు సహకారం అందించడం గొప్ప విశేషమని ఎమ్మెల్యే అంజిబాబు దాతను అభినందించారు. కార్యక్రమంలో ఎగ్జిబిషన్ అలీషా, చల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలం

విశాలాంధ్ర-టి నరసాపురం: మహాత్మాగాంధీ గ్రామీణజాతీయ ఉపాధి హామీ పథకంలో పొందు పరచిన అంశాలు అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) టి నరసాపురం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు విమర్శించారు. టి నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను శుక్రవారం అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకంకు నిధులు తగ్గించి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి ఉపాధి కార్మికుడికి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకి రూ. 700 కనీస కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండలో పనిచేస్తున్న కార్మికులకు టెంట్లు ఏర్పాటు చేసి, త్రాగునీరు, మజ్జిగ తో పాటు మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. జాబ్ కార్డు కలిగి వుండి ఉపాధి కల్పించని కూలీలకు సంవత్సరానికి 12వేలు ఉపాధి భృతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

జాబ్‌మేళాలో 170 మందికి అర్హత

విశాలాంధ్ర-నూజివీడు : రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. జాబ్ మేళాకు రాష్ట్రంలో 13 ప్రముఖ కంపెనీ ప్రతినిధులు హాజరుకాగా 600 మంది యువతీ, యువకులు హాజరయ్యారని, ముందుగా రిజిస్ట్రేషను కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు, తర్వాత సర్టిఫికెట్లు పరిశీలన చేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి యన్.జితేంద్రబాబు తెలిపారు. అందులో వివిధ కంపెనీల ద్వారా 170 మంది అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్మెంటు అధికారి కె.ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్లు వి.రవిశ్యామ్, ఆర్.ఫణికుమార్, యస్.సునీల్ కుమార్, కె.రాంబాబు, వి.కిషోర్, డి.రామకృష్ణ నాయుడు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు ప్రత్యేక చర్యలు

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: క్షయ రహిత సమాజం అందరి లక్ష్యం కావాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో ఇంటెన్సిఫైడ్ టి.బి. ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నిర్మూలన అవగాహన పోస్టర్లను, కరపత్రాలను కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయన్నారు. క్షయ పోషణ అభియాన్ కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. లక్షణాలు ఉన్న వారు సమీప ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించుకొని మందులు వాడాలని సూచించారు. ప్రధాన మంత్రి టి.బి.ముక్త్ భారత అభియాన్ ప్రోగ్రాం కింద ఎవరైనా సరే క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని నిక్షయ్ మిత్రగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇందుకోసం ని-క్షయ్ సంపర్క్ హెల్ప్‌లైన్ 1800-11-6666 టోల్ ఫ్రీని సంప్రదించవచ్చన్నారు. టి.బి.ని చికిత్స ద్వారానే కాకుండా నివారణ ద్వారా కూడా ఓడించాలన్నారు. దగ్గుమాత్రమే టి.బి.వ్యాధి లక్షణం కాదని, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పు తెమడతో కూడిన దగ్గు, తెమడలో రక్తం పడటం, జ్వరం, ఛాతిలో నొప్పి, అలసట, నీరసం, ఏదైనా శరీరభాగంలో గుల్లలు, వాపు రావడం వంటి లక్షణాల కనిపించినట్లయితే సమీప ఆరోగ్య కార్యకర్తను సంప్రదించా లన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ ఆర్.మాలిని, డిఐఓ డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి

విశాలాంధ్ర- చింతలపూడి: ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సీఐ సిహెచ్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం చింతలపూడి ఎస్ఐ కుటుంబ రావు, సిబ్బందితో కలిసి చింతలపూడి లో ఆటో డ్రైవర్లతో రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించరాదని తెలిపారు. ఆటోలను రోడ్డుపై అడ్డంగా ఉండకుండా నిర్మిత ప్రదేశాలలోనే నిలుపుకోవాలని, ఆటో డ్రైవర్లు ఆటోలు నడిపే సమయంలో ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. ఆటోలను డ్రైవర్లు ప్రమాద రహితంగా ఆటోలో ప్రయాణించే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని తెలిపారు. ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎస్.ఐ.కుటుంబరావు, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మూడో రోజు కొనసాగిన ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలలో ప్రవేశానికి ప్రత్యేక కేటగిరి విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం మూడో రోజు కొనసాగింది. క్రీడల కేటగిరిలో 467 మందికి గాను 354 మంది అభ్యర్థులు హాజరు కాగా, ఎన్సీసీ కేటగిరిలో 452 గాను 354 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ రిజిస్టర్, నూజివీడు డైరెక్టర్, అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ పర్యవేక్షించగా ప్రొఫెసర్ గోపాల రాజు, అసిస్టెంట్ రిజిస్టర్ అర్జున్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ హర్షణీయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : జూన్ నెల ఒకటో తేదీ నుండి రాష్ట్ర ప్రజలకు రేషన్ సరుకులను రేషన్ దుకాణం ద్వారా అందజేయాలని కూటమి ప్రభుత్వం ఆదే శాలు జారీ చేయడం హర్షించదగ్గ విషయమని మండల టీడీపీ అధ్య క్షులు పారేపల్లి నరేష్ పేర్కొన్నారు. మండ లంలో బయ్యనగూడెం గ్రామంలో రేషన్ దుకాణాన్ని కూటమి నాయకులతో కలిసి నరేష్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా నరేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రేషన్ వాహనాల ద్వారా పంపిణీ అంటూ జగన్ ప్రభుత్వం ఎన్నో అక్రమాలకు పాల్పడిందని, రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దు తేజ, బాలం నరేష్, పారేపల్లి బుజ్జిబాబు, బాలం గంగాధర్, ఆనెం సాయి, నులకని శ్రీను, ఆరేటి ఏసుబాబు పాల్గొన్నారు.

చిన్న వయస్సు నుండి పొదుపు చేయాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి ఒక్కరు చిన్నతనం నుండి డబ్బులు పొదుపు చేసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ గణప వరం మండలం పిప్పర సెక్టార్ సూపర్వై జర్ సిహెచ్ దుర్గా భవాని అన్నారు. శుక్రవారం మండలంలో ముప్పార్తిపాడు గ్రామంలో కిషోరి వికాసం వేసవి కార్యక్రమంలో భాగంగా సెషన్ -9 ఆర్థిక నిర్వహణ, పొదుపు గురించి సూపర్‌వైజర్ వివరించారు. చిన్న వయస్సు నుండి డబ్బు ఎలా పొదుపు చేయాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి మేరీ గ్రేస్, ఏఎన్ఎం టి. శాంతకుమారి, ఆశా వర్కర్స్, అంగన్వాడీ సహాయకురాళ్లు, వివో ఎ. సాయిరామ్ పాల్గొన్నారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర సిఐఎన్ నం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత , హామీదారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. నం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎకౌంట్ నం.	డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి	ఆస్తి యొక్క వివరాలు	స్వాధీనత రకం & తేదీ
1	సురేష్ రాయపాటి, మంగతాయారు రాయపాటి, వెంకటేశ్వరరావు రాయపాటి LP0000000074561	19-మార్చి-2024 16- మార్చి-24 నాటికి రూ.2213948	డి.నం.1-199, ఆర్.ఎస్.నం. 48/2, ఇసుకపట్ల పంగిడి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్, ఇసుకపట్లపంగిడి, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534342, 242 చదరపు గజాల విస్తీర్ణం. హద్దులు: ఉత్తరం:వేమన సత్యనారాయణ ఇంటి స్థలం 67'-6", దక్షిణం: గోపిశెట్టి సూర్యారావు ఇంటి స్థలం 6'-0", తూర్పు: రోడ్డు 31'-9", పడమర: కంచేటి సత్యనారాయణ మరియు ఇతరులు ఇంటి స్థలం 33'-0".	భౌతిక స్వాధీనత స్వాధీనత తేదీ: 27-మే-2025
2	తమ్మిశెట్టి సాయినాథ్, తమ్మిశెట్టి ఉషారాణి HL0000000150769	29-ఏప్రిల్-2024 27- ఏప్రిల్-24 నాటికి రూ.2638656	డోర్ నెం. 15 91 దగ్గర, ఆర్.ఎస్. నెం. 461/4, అసెస్‌మెంట్ నెం.1142007650, గ్రౌండ్ ఫ్లోర్ విష్ణు ప్లాజా, ఫ్లాట్ నెం. 1, జంగారెడ్డిగూడెం, మునిసిపాలిటీ, ఏలూరు, ఆంధ్రప్రదేశ్. ప్రదేశ్-534447, ఆస్తి విస్తీర్ణం: 668 చదరపు అడుగులు. హద్దులు: ఉత్తరం: పి వెంకటేశ్వర రావు స్థలం మరియు ఉమ్మడి బహిరంగ స్థలం, దక్షిణం: కె.కృష్ణారావు స్థలం మరియు ఫ్లాట్ నెం. 2, తూర్పు-రోడ్డు మరియు ఉమ్మడి కారిడార్ పార్కింగ్ ప్రాంతం, పడమర: జి.అన్నపూర్ణ స్థలం మరియు ఉమ్మడి బహిరంగ స్థలం.	భౌతిక స్వాధీనత స్వాధీనత తేదీ: 27-మే-2025

తేదీ: 31.05.2025
ప్రదేశము: పశ్చిమగోదావరి, ఏలూరు

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

తనఖాలో వున్న ఆస్తి అమ్మేశారు

- డబుల్ రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి ?
- మున్సిపల్ కౌన్సిలర్ తాతాజీ నిరసన
- చర్యలు తీసుకుంటాం... క్రిమినల్ కేసు పెడతాం : కమిషనర్

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్ : స్థానిక పట్టణంలో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడి వేడిగా సాగింది. ఇతర అంశాలతో పాటుగా ఇటీవల జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో మార్ట్ గేజ్ కింద ఉన్న అపార్ట్మెంట్లు బిల్డర్ ఏక పక్షంగా అమ్మేసు కోవడం చర్చనీయాం శంగా మారింది. దీనిపై కౌన్సిలర్ వలవల తాతాజీ కౌన్సిల్ మీటింగ్‌లో నిల దీశారు. కమిషనర్ కెవి రమణ క్రిమినల్ చర్యలు తీసుకొని ప్రాపర్టీ సీజ్ చేస్తామని ప్రకటించారు.

వివరాలు.. ఇలా వున్నాయి : జంగారెడ్డిగూడెం పట్టణంలో మున్సిపాలి టీకి తనఖా పెట్టిన 2 అపార్ట్మెంట్లులో ప్లాట్లు వేరే వారికి రిజిస్ట్రేషన్ చేసిన బిల్డర్ గురించి ఇటీవల కల కలం రేగింది. మున్సిపాలిటీకి తనఖాలో వున్న ఆ ప్లాట్లను సబ్ రిజిస్ట్రార్ వేరొకరికి ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేసారో అంతు చిక్కడం లేదని దీని గురించి తెలిసిన ప్రజలు ఆశ్చర్య పోతున్నారు. పట్టణంలో విక్టర్ ఫ్రయిడ్ అపార్ట్మెంట్లో ఈ ఫ్రాడ్ జరిగింది.

గుట్టు రట్టయ్యింది

అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతులకు ప్లాట్ నెంబర్ 401 నుంచి 404 వరకు మున్సిపాలిటీ కి షూరిటీగా తాకట్టు పెట్టారు. వాటిలో 402,401 ప్లాట్‌లు గుట్టుగా రిజిస్ట్రార్ కార్యా లయంలో మెనేజ్ చేసి ఇద్దరికీ అమ్మేసారు. ఈ విషయం స్థల యాజమాన్యం కు తెలియదు. వారి సంతకాలు కూడా లేకుండా 401ను ప.గో. జిల్లా కాళ్ళ గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి, 402ను జంగారెడ్డిగూడెం నకు చెందిన ఒక వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై బ్యాంక్‌లో రూ. 30 లక్షల ఋణం కూడా తీసుకోవడం విశేషం. ఈ విషయాలు బయ టకు పొక్కడంతో బిల్డర్ దీనికి సూత్రధారని మున్సిపల్ కమిషనర్ కె వి రమణ గుర్తించి ప్లాట్ ల రిజిస్ట్రేషన్ రద్దు చెయ్యాలని సబ్ రిజిస్ట్రార్‌ను కోరుతూ లేఖ రాసారు. ఈనెల 8న మున్సిపల్ కమిషనర్ తమ తనకాలో ఆస్తి అన్యాక్రాంతం అయ్యిందని వేరే ఇద్దరికి రెండు ప్లాట్ లు రిజిస్టర్ చేసారని వాటిని రద్దు చెయ్యాలని లేఖ రాయగా 26న దాదాపు 3 వారాల తరువాత రిజిస్టర్ చేయించుకున్న సతీష్, ఫణి కుమార్‌కు నోటీసులు ఇచ్చారు. బిల్డింగ్ స్థల యజమాని ఆర్ డి ఓ, రిజిస్ట్రేషన్ డిఐజికి ఫిర్యాదు చేశారు.

మోసం.... మోసం

స్థలం యజమాని కొల్లూరి సుగుణ జరిగిన మోసం తెలుసుకుని స్థానిక ఆర్‌డిఓ ఎంవి రమణ కు మీకోసంలో, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిఐజి, జిల్లా రిజిస్ట్రార్ కు, ఫిర్యాదులు చేశారు. బోగస్ రిజిస్ట్రేషన్ లను రద్దు పర్చాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో టౌన్ అండ్ కంట్రీ ప్లాన్ విభాగం వారికి మార్ట్ గేజ్ లో వున్నా ప్లాట్ లు వేరే వారికి ఏ విధానం లో రిజిస్టర్ అయ్యాయి ? అసలు సైట్ ఓనర్ సంతకాలు లేకుండా ఏ పద్ధతిలో ఇదంతా జరిగింది? అసలు తనఖా వున్నా ప్రోపర్టీకి బ్యాంక్ లోన్ ఎలా సాధ్యం? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆకుల కొండాజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

విశాలాంధ్ర -భీమవరం: కార్మిక నేత ఎఐటియుసి నాయకులు ఆకుల కొండాజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. ఆకుల కొండాజీ వర్ధంతిని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన ఆకుల కొండాజీ చిన్న వయసులోనే సిపిఐ సిద్ధాంతాలకు ఆకర్షితులై సిపిఐ, ఎఐటియుసి ఉద్యమాల్లో జిల్లాలో కీలకంగా పనిచేశారని కొనియాడారు. అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం, వారి జీవన ప్రమాణాలు పెరగడం కోసం ఆయన ఎన్నో పోరాటాలు చేశారని చెల్లబోయిన గుర్తు చేశారు. మున్సిపల్ బదిలీ వర్కర్స్, టెంపరరీ వర్కర్స్ ను పర్మినెంట్ చేయించడంతో ఆయన ఎంతో కృషి చేశారని పిఎఫ్, ఇఎస్ఐ, ఇతర అలవెన్సులు అందించడానికి ఆకుల కొండాజీ ఎంతో శ్రమించారని చెల్లబోయిన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు నీలాపు శ్రీను, రెల్ల రాము, ధనాల విశ్వనాథ్, మాడుగుల రవికుమార్, పీరుబాబు, సత్యనారాయణ, అడ్వకేట్ గెద్దాడ సూర్యనారాయణ తదితరులు ఆకుల కొండాజీకి నివాళులు అర్పించారు.

మహానాడు చరిత్రలో నిలిచిపోతుంది

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : గతంలో ఎన్నడూ లేనంత వైభవంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు కడప గడ్డపై జరిగిన టిడిపి మహానాడు చరిత్రలో నిలిచి పోతుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడించారు. ఇది చూసిన వైసిపి నాయకుల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నా యంటూ చమత్కరించారు. మహానాడు కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించిన అంశాన్ని శుక్రవారం ఏలూరులో మీడియాతో పంచుకున్న ఆయన కనీవినీ ఎరుగని రీతిలో మహానాడును సూపర్ సక్సెస్ చేసిన ఘనత టిడిపి శ్రేణులకే దక్కుతుందన్నారు. వైసీపీ ఎన్ని అవాంతరాలు సృష్టించాలని చూసినా మహానాడు విజయవంతానికి విశేషంగా కృషిచేసిన రాయలసీమ ప్రాంత నేతలకు, పెద్ద ఎత్తున తరలివచ్చిన ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ శ్రేణులకు ఎమ్మెల్యే చంటి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వర్తక సంఘాలు సామాజిక సేవలో భాగస్వాములు కావాలి :ఎమ్మెల్సీ వంక

విశాలాంధ్ర-తణుకు: వర్తక సంఘాలు సామాజిక సేవలలో భాగ స్వాములు కావాలని శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. తణుకులో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన సంఘ భవన ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సరుకులు అందించేందుకు కిరాణా దుకాణాలు పని చేయాలని, మాల్స్ లాంటి బహుళ జాతి కంపెనీలతో పోటీపడుతూ పరిసర ప్రాంత ప్రజలకు అవసరమైన సరుకులను సరసమైన ధరలకు అందించాలన్నారు. తద్వారా ఉభయులు లబ్ధి పొందుతారని చెప్పారు. సంఘ భవనం పై వచ్చే ఆదాయాన్ని పేద వర్తకులకు, సేవా కార్యక్రమాలకు వినియోగించాలని రవీంద్రనాథ్ సూచించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ,వర్తక సంఘ అధ్యక్షుడు మాజేటి ప్రకాశం, షర్మిష్ట వీరన్న , ఆకుల బాబు, దొమ్మేటి సుధాకర్,వావిలాల సరళా దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

విశాలాంధ్ర - నరసాపురం : ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. జనసేన పార్టీ కార్యాల యంలో శుక్రవారం నిర్వ హించిన గ్రీవెన్స్ సెల్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి పొత్తూరి రామరాజుతో కలసి ప్రారంభించి మాట్లాడారు. ఈ వేదిక ద్వారా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వినడం, వాటికి పరిష్కార మార్గాలను సూచించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రజల నుండి వచ్చిన వ్యక్తిగత, సామూహిక సమస్యలు, అభ్యర్థనలు, విజ్ఞప్తులను స్వీకరించారు. అన్ని అంశాలపై సంబంధిత శాఖలతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజల సహకారంతో ఈ వేదిక ద్వారా సమస్యల పరిష్కారానికి మరింత వేగవంతమైన మార్గం సుసాధ్యం అవుతుందన్న నమ్మకంతో ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించాలని నాయకులు తెలియజేశారు.

పెన్నాడలో ఫ్రైడే డ్రైడే

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామంలో ప్రతి శుక్రవారం పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని సంబంధిత ఆరోగ్య శాఖ సిబ్బందిచే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి హెచ్ఈఓ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా నీరు నిలవ లేకుండా చూసుకోవాలని, నీరు నిలవ ఉండటం వల్ల దోమలు చేరి వివిధ రకాల వ్యాధులను కలిగిస్తాయని తెలిపారు. ముఖ్యంగా ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా సంబంధిత వ్యాధులు దోమల ద్వారా సంక్రమిస్తాయని అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఆవాసాల పరిసరాలలో తడి లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్ పి.ఆశ, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సూపర్ క్లోరినేషన్‌తో నీటి శుభ్రం

విశాలాంధ్ర - అనపర్తి : నీటి సరఫరా వ్యవస్థలో కాలుష్యం ఉంటే సూపర్ క్లోరినేషన్ ద్వారా నీటిని శుభ్రపర్చవచ్చని పెదపూడి డిప్యూటీ ఎంపీడీవో ఎమ్‌ఎస్ ఎన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కుమార ప్రియం నీళ్ళ ట్యాంక్ వద్ద డిప్యూటీ ఎంపీడీవో ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సుంకర వీరాస్వామి ఆధ్వర్యంలో సూపర్ క్లోరినేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివాని, వీరేంద్ర, అన్నవరం, గొర్రెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కడియం రైల్వే గేటు మూసివేత

విశాలాంధ్ర - కడియం : జూన్ 1 వ తేదీ ఉదయం 7 గంటలనుండి 6 వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు కడియం రైల్వే గేటు మూసి వేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్ర వారం ఒక ప్రకటన విడుదల చేసారు. కడియం రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్ పునరుద్ధరణ పనులు జరుగుతుండడంతో కడియం నుండి రాజవోలు వెళ్లే వాహనదారులు, కడియం ఆవ ప్రాంతం పొలాలకు వెళ్లే రైతులు రాకపోకలకు ప్రత్యా మ్నాయం చూసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

ఒకటి నుంచి రేషన్ షాపులు ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం: జూన్ ఒకటవ తేదీన ప్రారంభోత్సవాలతో రేషన్ షాపులు ప్రారంభం కానున్నట్లు తహసిల్దార్ ఏ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 2025 జూన్ ఒకటవ తేదీన మండలంలో గల 44 రేషన్ సరఫరా షాపుల్లో ఉదయం 8 గంటలకు అందుబాటులో ఉన్న నాయకులు, పెద్దలతో రేషన్ షాపులను ప్రారంభించడం జరుగుతుంది అని అన్నారు. ఈ రేషన్ షాపులు ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ప్రజలకు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ షాపులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకూ ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే రేషన్ కార్డుల్లో సింగిల్ పర్సన్ అయినా 65 సవంత్సరాలు దాటిన, దివ్యాంగులకు రేషన్ సరుకులు ఇంటి వద్దే అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కావున ప్రజలందరూ రేషన్ షాపుల వద్ద రేషన్ సరుకులు తీసుకోవాలని కోరారు.

విద్యార్థికి స్కాలర్ షిప్

విశాలాంధ్ర-దేవర పల్లి: మెడికల్ ఎంబీబీఎస్ 4వ సంవత్సరం చదువుతున్న దేవరపల్లి మండలం చిన్నాయి గూడెం గ్రామానికి చెందిన వంపు గడప బాబుకి పార్డ్ ఇండియా స్వచంధ సంస్థ రూ.5వేలు స్కాలర్ షిప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సోమ శెట్టి వెంకట రావు, సత్యనారాయణ, బాబూరావు, బి.నాగమణి, నాగమణి, బాబు, నాని, తదితరులు హాజరు అయ్యారు.

శోభనబాబు జీవిత సాఫల్య పురస్కారం

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు పట్టణానికి చెందిన విద్యావేత్త, సామాజికవేత్త డా।।విప్పర్తి ఐజాక్ న్యూటన్ పండుకు శోభన్ బాబు స్మారక స్వచ్ఛంద సేవ సంస్థ విశాఖ పట్నం వారిచే విజయవాడ అలం కార్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో శోభన్ బాబు స్మారక స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కె కృష్ణమూర్తి చేతుల మీదుగా శోభన్ బాబు జీవిత సాఫల్య పురస్కార్‌ను ప్రధానం చేశారు. ఇది న్యూటన్ పాండుకు 54వ పురస్కార్ అవార్డు కావడం విశేషం కగా ప్రముఖ ప్రజాప్రతినిధులు కలెక్టర్లు, మంత్రులు చేతుల మీదుగా 150 కి పైగా సన్మానాలను అందుకున్నారు.

వెన్నుపోటు దినం కాదు ప్రాయశ్చిత్త దినం

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

విశాలాంధ్ర - రావులపాలెం : "వెన్నుపోటు దినం" పేరిట వైసీపీ నాయకులు నిర్వహించే కార్యక్రమం హాస్యాస్పదమైంది. ఐదేళ్లు ప్రజల విశ్వాసాన్ని తాకట్టు పెట్టి, విధ్వంసకర పాలన కొనసాగించిన జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు "ప్రాయశ్చిత్త దినం" జరుపుకో వాల్సిన అవసరం ఉంది. 151 సీట్లతో ఘన విజయాన్ని అందించిన ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారు. మద్యం కుంభకోణం, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల అరెస్టులు, సిట్ దర్యాప్తు తన హయాంలో జరిగిన అక్రమాలను విస్మరించి, ఇప్పుడు మళ్లీతప్పుడు ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం ఆయన వికృతమైన మనస్తత్వానికి నిదర్శనం. జూన్ 4న వెలువడిన ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పు స్పష్టంగా చెప్పారు. వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారు. ఇది జగన్ పాలనపై ప్రజల తీర్పు. ఈ రోజును "వెన్నుపోటు దినం"గా కాకుండా "ప్రాయశ్చిత్త దినం"గా పరిగణించాలి. మహానాడు విజయాన్ని చూసి అసహనం చెందిన వైసీపీ నాయకులు తప్పుడు మాటలతో ప్రజలను మోసం చేయాలనుకుంటున్నారు. లోకేష్ యువతకు భవిష్యత్ నాయకుడిగా ఎదుగుతున్నారు. ఇది జీర్ణించుకోలేని వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. అవినీతిపరులు, అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా మారింది.

5 కోట్ల మంది ప్రజలను వెన్నుపోటు పొడిచారు

వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపణ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వర పురం మండలం ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి యేడాది అయ్యినను ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చెయ్యకుండా 5 కోట్ల ఆంధ్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారని కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో గల వైసీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎమ్ఎల్‌సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. 2024 జనరల్ ఎన్నికలు కౌంటింగ్ జరిగిన జూన్ 4న కూటమి ప్రభుత్వం మెజారిటీ సాధించిందన్నారు. అదే రోజు జూన్ 4న వెన్నుపోటు దినంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారని ఎమ్ఎల్‌సీ తోట పేర్కొన్నారు. కేవలం కూటమి ప్రభుత్వం ప్రతి పక్ష కార్యకర్తలును అణిచివేసే ఉద్దేశ్యంతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తుందని తోట విమర్శించారు. వచ్చే నెల జూన్ 4వ తేదీనరాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ప్రజా వెన్నుపోటు దినంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆ రోజు మండపేట నియోజక వర్గం నుండి అధిక సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు మండపేట పట్టణంలో గల వైసీపీ కార్యాలయంనకు తరలి రావాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అబ్బు, మాజీ ఏఎమ్‌సి చైర్మన్ సిరివరపు శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, తిరునాతి వెంకటేశ్వర రావు, గూటం సత్య నారాయణ అధిక సంఖ్యలో వైసిపి శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ఎంతో మేలు నేరేడు

విశాలాంధ్ర-దేవరపల్లి : ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే నేరేడు పండ్లు మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. సెంటర్లోనూ రోడ్ల పక్కన నేరేడు కాయలు అమ్ముతున్నారు. ఈ సీజన్‌లో దొరికే పండ్లతో పాటు పోషకాల్లో రారాజుగా ఖ్యాతి చెందిన నేరేడు పండ్లు కు ఎంతో ప్రాధాన్యత ఉంది గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లో పుంత రోడ్లు వెంబడి నేరేడు చెట్లు దర్శనమిస్తా ఉండేవి. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల లో వేసవికాలం వచ్చిందంటే పిల్లలు వేసవి సెలవులలో ఇంటికొచ్చిన తరువాత పొలాలకు వెళ్ళి నేరేడు చెట్లు వద్ద పళ్ళు ఏరుకుని తినేవారు రాను రాను నేరేడు పళ్ళు కూడా అమ్మటానికి సిద్ధమ య్యాయి అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ సాగులోకి రావడంతో అక్కడ ఉన్న చెట్లు తొలగించడం జరిగింది నేడు గ్రామీణ ప్రాంత వాసులు కూడా నేరేడు కాయలు కొనుక్కోవాల్సిందే అలాగే దేవరపల్లి మార్కెట్‌కి నేరేడు కాయలు రావడంతో ఘనమైన ప్రాంతవాసులు కూడా నేరేడు కాయలను కొనుగోలు చేస్తున్నారు. రూ.50లు కిలోరూ.180లు ధర పలుకుతోంది అయినప్పటికీ షుగర్ వ్యాధికి బీపీకి నేరేడు కాయలు ఎంతో ఉపయోగమని డాక్టర్లు కూడా చెప్తూ ఉంటారు. ఈ సందర్భంగా దేవరపల్లి పిహెచ్ వైద్యులు డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ నేరేడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని ఆయన తెలిపారు.

"వికాస" ఆధ్వర్యంలో జూన్ 2న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : "వికాస" ఆధ్వర్యంలో జూన్ 02వ తేదీ సోమవారం "వికాస" కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ"లో" "జాబ్మేళా" నిర్వహిస్తున్నారు. ఈ జాబ్ మేళాలో బేబీవరల్డ్ స్టోర్‌మేనేజర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మేనేజర్, గ్రాఫిక్ డిజైనర్, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్, సీనియర్ అకౌంటెంట్ ఎగ్జిక్యూటివ్, డిజిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్, వేర్ హౌస్ మేనేజర్, స్టోర్ఇన్‌ఛార్జ్, అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టార్పెచ్ ఇన్నోవేషన్స్ కంపెనీలో టెక్నికల్ ట్రైనీ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఫాక్స్కాన్ కంపెనీలో ఆపరేటర్, హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్&ఎంబిఏ ఉత్తీర్ణులైన 35 సం.లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ. 12వేలు నుండి రూ. 30వేలు వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి & రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. అలాగే డిడియుజికెవై స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా టు వీలర్ టెక్నీషియన్, లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. ట్రైనింగ్ సమయంలో ఉచిత భోజనం, వసతిసౌకర్యం ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ జూన్ 2న సోమవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌తో హాజరు కావలెను. వివరాలకు సెల్‌నెం:7799376222 www.vikasajobs.com సంప్రదించవలెను.

గ్రామాల్లో అంతంత మాత్రంగానే వీధి దీపాలు

విశాలాంధ్ర- సీతానగరం: గ్రామాల్లో అంతంత మాత్రంగానే వీధి దీపాల వెలుగులు. మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారుగా అధికారుల లెక్కల ప్రకారం 4200 విద్యుత్ దీపాలు ఉన్నాయి. అయితే ఈ దీపాలు సరైన ఆదరణ లేక గ్రామాలు క్రమంగా వెలుగులకు దూరం అవుతున్నాయి అనడంలో సందేహం లేదు. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వం గుత్తేదారుల ద్వారా ఎల్ ఈ డి వీధి దీపాలను గ్రామాలకు పరిచయం చేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వై ఎస్ ఆర్ సి పి ప్రభుత్వం గుత్తేదారులు బిల్లులు చెల్లించక పోవడం అప్పటికే కొన్ని బిల్లులు పెండింగ్లో ఉండడం వంటి అంశాలతో గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ అగమ్య గోచరంగా మారింది అని ప్రజలు ఆరోపిస్తున్నారు. నేడు ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన ఈ వీధి దీపాల నిర్వహణ పై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గ్రామాల్లో 50 శాతం చీకట్లు కమ్మాయి అని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, నాయకులు చర్యలు చేపట్టి గ్రామాల్లో వెలుగులు నింపాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ అంతరాయం నివారణకే ఆకులు తొలగింపు : ఎస్ఈ రాజబాబు

విశాలాంధ్ర-కాట్రేనికోన : వాతావరణం ప్రతికూలంగా ఉండుట వల్ల కాట్రేనికోన, ముమ్మిడివరం, ఉప్పలగుప్తం మండలాలలో విద్యుత్తు లైన్ వెంబడి చెట్ల కొమ్మలు, కొబ్బరి ఆకులు లైనుకు అతి సమీపములో వచ్చుట వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుచున్నది. దీనిని నివారించడానికి రెగ్యులర్ వారాంతపు నిర్వహణలో భాగంగా వినియోగదారులకు నాణ్యమయిన, నిరంతర విద్యుత్ సరఫరా చేయుటకు విద్యుత్ తీగలకు సమీపములో ఉన్న చెట్ల కొమ్మలు, కొబ్బరి ఆకులను, పాదులను తొలగించామని. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సూపరిండెంట్ ఇంజనీర్ యస్ రాజబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సక్రమ నిర్వహణకు ఇది తరచూ సాధారణంగా జరిగే కార్యక్రమం మాత్రమేనని ఆయన తెలిపారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

- పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలి
- గిన్నిస్ రికార్డు గ్రహీత వి.సాత్విక అద్భుత యోగ ప్రదర్శన
- శనివారం పోలీస్, మాజీ సైనికులు, రక్షణ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో యోగాంధ్ర – జేసి చిన్న రాముడు

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : యోగాంధ్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరంలోని గ్రాండ్ ట్రంక్ రోడ్ లో జరుగుతున్న యోగ సాధన కార్యక్రమం వరుసగా ఐదవ రోజు అయిన శుక్రవారం కూడా కొనసాగింది. "వైద్యాధికారులు, వైద్యులు" (మెడికల్ ఆఫీసర్స్& డాక్టర్స్) అనే ఇతివృత్తంతో వైద్య,ఆరోగ్యశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఓఎన్జిసి కమ్యూనికేషన్స్ అధికారి అయిన డాక్టర్ పి. రామచంద్ర యోగసాధన చేయించారు. యోగ ప్రోటో కాల్‌ను అనుసరిస్తూ 45 నిమిషాల పాటు సూక్ష్మ వ్యాయామం, త్రికోణాసనం, భద్రాసనం, భుజంగాసనం మొదలైన ఆసనాలు వేయించారు. గిన్నిస్ రికార్డు గ్రహీత, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ విద్యార్థిని అయిన వి. సాత్విక అబ్బురపరిచే రీతిలో యోగాసనాలను వేశారు. అనంతరం ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా సంయుక్త కలెక్టర్ జి .చిన్న రాముడు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం అయిన జూన్ 21వ తేదీ వరకు ఈ యోగాంధ్ర కార్యక్రమం కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు. జూన్ 21న నగరంలో ఎక్కువమంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తనంతుగా, తన – తన కుటుంబ సభ్యుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం యోగా సాధనలో పాల్గొనాలని https://www.yogandhra.ap.in పేర్లు నమోదు చేసు కోవాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి సీతా రామమూర్తి మాట్లాడుతూ ఏడు లక్షల మంది యోగాంధ్ర కార్యక్రమంలో నమోదు కావాలన్నది జిల్లాకు ఇచ్చిన లక్ష్యమని, దీనిని చేరుకోవడానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, అందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచిం చారు. జూన్ 1వ తేదీన పర్యటక ప్రాంతమైన సరస్వతి ఘాట్‌లో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీ.ఎం.హెచ్.ఓ డా కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఆయుష్ అధికారి డా కె. రమేష్ , యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి పి. కాజియా, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, వైద్య శాఖ సిబ్బంది, వైద్య విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

పుంత రోడ్డు అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర – ఆలమూరు : మండలంలోని గుమ్మిలేరు గ్రామ శివారుణ ఉన్న జైన్ దేవాలయం నుండి తాడి నాని పశువులపాక వరకు ఉన్న పుంత రోడ్డును తాత్కాలిక మరమ్మత్తులు చేయించి, అభివృద్ధి చేయాలని ఆ గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు కోరారు. శుక్రవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యా నందరావు ఆధ్వర్యంలో ఆయన క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో సర్పంచ్ గుణ్ణం రాంబాబు పాల్గొని ఎమ్మెల్యే బండారుకు వినతి పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలియజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాల సమయంలో పుంత రోడ్డు అధ్వానంగా తయారవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిధులు మంజూరు చేసి తాతకాలికంగా గ్రావెల్ రోడ్డు నిర్మించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే బండారు సాను కూలంగా స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు రాజోలులో మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర – రాజోలు : రాజోలు రోటరీ క్లబ్ నందు శనివారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ తెలి పారు. శుక్రవారం రోటరీ క్లబ్ నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లా డారు. శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మెడ్ ఆసుపత్రికి చెందిన అనుభవజ్ఞులైన వైద్యులతో ఈ శిబిరాన్ని నిర్వహి స్తున్నమన్నారు. రోటరీ క్లబ్ సారథ్యంలో జరిగే ఈ వైద్య శిబిరాన్ని రాజోలు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దార్ల పెదబాబు నామన షన్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నకు రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం

- 31 రోజులకు రూ.1.32 కోట్లు
- 104 గ్రాముల బంగారం నిలువు దోపిడి సమర్పించిన భక్తురాలు

విశాలాంధ్ర– ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో హుండీ లెక్కింపు నిర్వహించగా 31 రోజులకు రికార్డు స్థాయిలో రూ. 1.32 కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిష నర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో గురు వారం ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హుండీలను తెరిచి లెక్కింపు ప్రారంభించారు. దేవాదాయ ధర్మా దాయ శాఖ రాజమండ్రి తనిఖీదారు టివిఎస్ఆర్ ప్రసాద్, గోపాలపురం గ్రూపు దేవాలయాల కార్య నిర్వహణాధికారి బి కిరణ్, ఆత్రేయపురం గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి బి నరేంద్ర కుమార్ పర్యవేక్షణలో పరకామణి సేవకులు లెక్కిం పు నిర్వహించారు. లెక్కింపు సాయంత్రం వరకు కొనసాగింది. ఆలయ ప్రధాన హుండీల నుంచి రూ. 1,11,60,745, అన్న ప్రసాద హుండీల నుంచి రూ. 20.43,431 వెరసి రూ. 1,32,04, 176 ఆదాయం లభించింది. అలాగే ఒక భక్తురాలు నిలువు దోపిడీగా సమర్పించిన 104 గ్రాముల బం గారంతో పాటు మరో 8 గ్రాముల బంగారం, 980 గ్రాముల వెండి, 64 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని డీసీ చక్రధరరావు తెలిపారు. కార్యక్ర మంలో శ్రీవారి సేవకులు, గ్రామ పెద్దలు, బ్యాంకు అధికా రులు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

అయినాపురంలో త్రాచు పాము పట్టివేత

విశాలాంధ్ర – కాట్రేనికోన : ముమ్మిడివరం మండలం అయినాపురం గ్రామంలోని శివాల యం వీధిలో సీతా వెంకట రామాచారి గృహం వద్ద త్రాచుపామును స్నేక్ క్యాచర్ వర్మ శుక్ర వారం పట్టుకున్నారు. త్రాచు పాము గత నాలుగు రోజులుగా ఇంటి సన్ సేడ్ పై దాగి ఉండగా యజమాని సమాచారం మేరకు స్నేక్ క్యాచర్ వర్మ వచ్చి చాకచక్యంగా పట్టుకు న్నారు. స్థానికులు చూసేలా కొంతసేపు తాచు పామును వర్మ ఆడించారు.

అక్రమ ఆక్వా చెరువులు తొలగించాలి: సీపీఎం

విశాలాంధ్ర – కరప : కరప మండలంలోని సిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 88.39 ఎకరాలు భూమిలో అనధి కార ఆక్వా సాగు చేస్తున్నట్టు జిల్లా మత్స్యశాఖ అధికారి, 692/D/ 2025 తేదీ 16-5-2025న మెమోలో విద్యుత్ శాఖ అధికారికి విద్యుత్ కనెక్షన్ తొలగించాలని కోరుతూ లేఖ రాసారు. ఆక్వా సాగుదారుడు, 28 మంది రైతుల వద్ద నుండి లీజుకి భూమి తీసుకొని, ఆక్వాసాగు చేస్తూ, అన్ని నిభందనలు అతిక్రమించినట్టు అర్ధమవుతుందని సీపీఎం నాయకత్వం గుర్తించింది.గతంలో సీపీఎం నాయక త్వాన గ్రామస్తులు, రైతులు అక్రమ ఆక్వా సాగుకి వ్యతిరేకంగా పోరాడామని, ఆ సందర్భంగా పోలీసు కేసులు పెట్టి కోర్టుకి తిప్పారని అయినా సీపీఎం వెనకడుగు వేయలేదని సిపిఎం జిల్లా నాయకులు ఎం రాజశేఖర్ తెలిపారు. అధికారులు ఇప్పటికే కొన్ని చెర్రువులు నిలుపుదల చేసారని, మిగిలిన చెరువులు కూడా తొలగించాలని డిమాండ్ చేసారు. ఇంత కాలం అనధికార చెరువులకు విద్యుత్ అధికారులు విద్యుత్ కనెక్షన్ ఏ ప్రతిపదికన ఇచ్చారని ప్రశ్నించారు. మండల రెవిన్యూ అధికారి స్పందించి తక్షణం బాధ్యులు పై చర్యలు తీసుకోవాలని రాజశేఖర్ కోరారు.

విద్యుత్ సబ్ స్టేషన్లలో బ్రేకర్ల సమస్యలు తొలగించాలి

విశాలాంధ్ర – ఆలమూరు : మండలంలోని చొప్పెల్ల విద్యుత్ సబ్ స్టేషన్‌లో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ బ్రేకర్ల సమస్యలను తొలగించాలని పరిధిలోని గ్రామాల ప్రజలు కోరుతు స్థానిక విలేకర్ల దృష్టికి తీసుకుని వచ్చారు. అధిక లోడు, విద్యుత్ ప్రమాదాలు సంభవించినప్పుడు ఈ బ్రేకర్లు ట్రిప్పు ద్వారా సహాయపడుతుంటాయని విద్యుత్ సిబ్బంది అంటున్నారు. ఇటీవల అధిక లోడు కారణంగా ఇది సరైన రీతిలో పనిచేయకపోవడంతో జొన్నాడ, మూల స్థాన అగ్రహారం గ్రామాలలో తరచు విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం ఇప్పుడు ఉన్న 120 నుండి 130 కిలో వాట్స్ సామర్థ్యం గల బ్రేకర్ పై 200 వాట్స్ గల అధిక లోడు భారం పడడంతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయని విద్యుత్ సిబ్బంది అంటున్నారు. ఈ బ్రేకర్ శుక్రవారం మధ్యాహ్నం అర్ధాంతరంగా పనిచేయక పోవడంతో రెండు గ్రామాల్లోను కొన్ని గంటలపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీనిపై విద్యుత్ అధికారులు మరమ్మత్తులు నిర్వహించి విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా పునరుద్ధరించారు. అలాగే ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ల ద్వారా రెండు గ్రామాలకు వేరువేరుగా బ్రేకర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకొని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుచున్నారు.

దుర్గారావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర–దేవరపల్లి: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు దేవరపల్లి మండలం టిడిపి మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు జన్మదిన వేడుకలు శు క్రవారం దేవరపల్లిలోని తన స్వగ్రామంలో ఘనంగా జరిగాయి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనే సుంకర దుర్గారావుజన్మదిన సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన కేకుని కట్ చేసి పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయ కులు యాగంటి సాయిబాబు నందిగాం బుల్లి రాజు కరుటూరి బాలాజీ తలశిల లక్ష్మీ కురుకూరి భరత్ పడమటి సుమన్ విజయరాజ కాటు నరేంద్ర యాగంటి సుబ్రహ్మణ్యం అభిమానులు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర – కడియం : చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే యువ తకు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె రమేష్ తెలిపారు. కడియం గ్రామ పంచాయతీ ఆవరణలో గల వెలుగు బంటి రామచంద్రరావు కమ్యూనిటీ సెంటర్‌లో 31న శనివారం ఉదయం 10 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశములు కల్పించాలనే ఉద్దేశంతో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, సీడప్ వారి సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రమేష్ పేర్కొన్నారు. మండలం లోని యువతీయువకులు అవగాహన కార్యక్రమంలో పాల్గొని, సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.

పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం

విశాలాంధ్ర – కరప : పరిశుభ్ర గ్రామాల లక్ష్యంగా చెత్త సేకరణ చేయుట జరుగుతుందని డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు పేర్కొన్నారు. కరప మండలం సిరిపురం గ్రామంలో తడి పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించి ఇంటింటికి తిరుగుతూ చెత్త కలెక్షన్ చేయడం జరిగిందన్నారు. ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాలకు చెత్తను తరలించి ఎరువులుగా మారుతున్నమని ఆయన తెలిపారు. పారిశుధ్యం పై చెత్త శుద్ధితో పనిచేయాలని పంచాయతీ వర్కర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పిలిశెట్టి వీరభద్రరావు, దుర్గ భవాని, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక, ఆరోగ్యం

-ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

విశాలాంధ్ర-ఏలేశ్వరం : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కేవి సూర్య నారాయణ అధ్యక్షతన నిర్వహించిన యోగాంధ్ర శిక్షణ ముగింపు కార్యక్రమంలో స్థానిక మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి నరసింహామూర్తి (బుజ్జి) శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుజ్జి మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని అందిస్తుందని అన్నారు. అలాగే మనసుకి ప్రశాంతత కలుగజేస్తుందన్నారు. అనంతరం యోగాంధ్ర-2025 ప్రచారంలో పాల్గొని స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి భారీ ర్యాలీగా ముందుకు సాగుతూ ప్రజలకు యోగా పై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ యోగాంధ్ర దిశగా పయనించాలని ఎంపిపి తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కుసరాజు, మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి, వైద్య సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకు రవికాంత్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - సామర్లకోట : గత 32 సంవత్సరాలుగా భారతీయ రైల్వేలో వివిధ హోదాలలో పనిచేస్తూ సీనియర్ సెక్షన్ ఇంజనీరుగా పదవీ విరమణ చేస్తున్న గంపల రవికాంత్ సేవలు భారత్ రైల్వేకి ఎంతగానో ఉపయోగపడి నవని ఆయన అభినందనీయులని విజయవాడ డివిజనల్ రైల్వే అధికారులు రవికాంత్‌ను కొనియాడారు. ఈ సందర్భంగా ఐఓడబ్ల్యు కార్యాలయం వద్ద పదవీ విరమణ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రవికాంత్ దంపతులను ఆయన కుటుంబ సభ్యులను వివిధ హోదాలలో పనిచేస్తున్న రైల్వే అధికారులు కార్మికులు భారీ గజమాలలో, సాలువాలు, కిరీటాలతో ఘనంగా సన్మానించారు. సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌గా పనిచేస్తూ రవికాంత్ కాకినాడ రైల్వే స్టేషన్, సామర్లకోట రైల్వే స్టేషన్ రూపురేఖలను మార్చివేసి ఆయన పరిధిలో ఉన్న అన్ని స్టేషన్లోనూ అభివృద్ధి పనులు సక్రమంగా నిర్వహించి అందరి మన్ననలు పొందారని రైల్వే అధికారులు కొనియాడారు. స్టేషన్ మేనేజర్ రమేష్, ఆయా డిపార్ట్మెంట్ల అధికారులు, కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

కిషోరీ వికాస వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిని కుమారి కె విజయకుమారి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసిడి ఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ సిచెహ్ ఎస్ కే దుర్గాదేవి ఆధ్వర్యంలో జిల్లా బాలాల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి దుర్గారాణి కిషోరీ వికాసము వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమం సెషన్ 9 యూ కొత్తపల్లి మండలంలోని కొండేవరం గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు అనే అంశాలమీద కిషోరి బాలికలకు అవగా హన కల్పించడం జరిగింది. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి దుర్గారాణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిర పడడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఎంత సంపాదించాం అన్నది కాకుండా ఎంత ఖర్చు పెడుతున్నాం, ఎంత పొదుపు చేస్తున్నాము ఎంత ఖర్చు నియంత్రిస్తున్నాము అనే అంశాలపై ప్రణాళిక ఉన్నట్లయితే సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కిషోరీవికాసం కార్యక్రమం ద్వారా బాలికల జీవన విధానంలో ప్రభావితం చూపుతుందని తెలుపుతూ బాలలచట్టాల పై కూడా అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు వయసు పూర్తకుండ అమ్మాయికి 21 సంవత్సరాలు పూర్తవుకున్న అబ్బాయికి వివాహం చేసినట్లయితే బాల్య వివాహంగా పరిగణించి వారిపై బాల్య వివాహ నిషేధిత చట్టం 2006 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అదే విధంగా మంచి స్పర్శ చెడు స్పర్శల పై అవగాహన కల్పించి పిల్లల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే లేదా బాల్య వివాహం జరుగుతుందని ఎవరికైనా సమాచారం తెలిసినా 1098కి లేదా 112కి కాల్ చేసి సమాచారం ఇవ్వగలరని అలాగే సైబర్ నేరాలపై 1930కి సమాచారం ఇవ్వగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి : కలెక్టర్

విశాలాంధ్ర-అమలాపురం : ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా రోజువారి దైనందిన జీవితంలో ఒక భాగంగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ 26 జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించి, 11వ అంతర్జాతీయ దినోత్సవ వేడుకల నిర్వహణ, ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం అమలు తీరు, ప్రజాసంతృప్తి స్థాయిలు పురోగతి, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం నిర్వహణ అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా ఒత్తిడి దూరమై మానసిక, శారీరక దృఢత్వం పెరుగు తుందన్నారు ప్రస్తుత కాలంలో ప్రతీ ఒక్కరూ ఒత్తిడితో కూడిన జీవనం గదుపుతున్నారని, యోగా ద్వారా మానసిక, శారీరక దృఢత్వం కలుగుతుందని, యోగాను ప్రతీ ఒక్కరు వారి జీవనశైలిలో భాగంగా చేసుకునేలా ఈ నెల వారి కార్యక్రమాలలో చైతన్యాన్ని తీసుకురావాలన్నారు. జూన్, 21వ తేదీన ప్రపంచ యోగ దినోత్సవాన్ని మన రాష్ట్రంలో భారత ప్రధాని మోడీ నిర్వహించడం మనకు ఎంతో గర్వకారణమన్నారు. జిల్లాలో యోగా ట్రైనర్లను గుర్తించామని, వారితో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలోని ప్రజలతో యోగాభ్యాసన చేయించడంతోపాటు, యోగా పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలలో రోజులు పాటు యోగా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలతో యోగాభ్యాసన చేస్తూ ప్రతిరోజు ఆచరించేలా చూడాలన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో యోగాంధ్ర పోటీలను నిర్వహించాలన్నారు. గ్రామ, వార్డుస్థాయిలో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయిలో జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు, జిల్లాస్థాయిలో జూన్ 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించా లన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక సచివాలయాల్లో సంప్రదించి సంబంధిత యోగా పోటీల్లో పాల్గొనాలని. యోగా యాప్‌లో ప్రతీ ఒక్కరిని నమోదు చేయాలని జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమంలో 8 లక్షల రిజిస్ట్రేషన్లు లక్ష్యం నిర్దేశించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రెండు కిలో వాట్ల వరకు ఉచితంగా సౌర విద్యుత్ యూనిట్లను స్థాపించాలని, బీసీ వినియోగదారులకు కేంద్రం ఇచ్చే రాయితీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.20 వేలు అదనంగా రాయి తీని ఇస్తుందన్నారు. ప్రజా సంతృప్తి స్థాయిలపై సమీక్షిస్తూ ఎన్టీఆర్ వైద్య సేవ విద్యుత్ సరఫరా, ఇసుక సరఫరా దేవాలయాలు దర్శనాలు, మున్సిపల్ సర్వీసులు వంటి అంశాలలో సంతృప్తి స్థాయిలు పెంచాలని ఆయన ఆదేశించారు. జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హరితాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్నదని ఆ దిశగా గ్రీనరీని పెంపొందించేందుకు విలువ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, ఎస్సీ ట్రాన్స్కో ఎస్ రాజబాబు, డిఎస్‌డిఓ పిఎస్ సురేష్ కుమార్, ఎస్‌డిసి పి కృష్ణమూర్తి, డిఐపిఆర్ఓ కె లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షా కేంద్రాల తనిఖీ

పరీక్ష రాయనున్న 6302 అభ్యర్థులు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లాలో జూన్ 1తేదీ ఆదివారం ఏపీఎస్ఎల్ఆర్‌బి పోలీస్ కానిస్టేబుల్ తుది పరీక్ష జరగనుంది. కాకినాడ జిల్లాలో 12 మెయి పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఈ పరీక్ష కేంద్రాలను శుక్రవారం కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ పరీక్షలలో సుమారు 6302 మంది పరీక్షలు రాయనున్నారని వారందరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా పరీక్షలను రాసుకునేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోలీస్ అధికారులకు దిసానిర్దేశం చేశారు. కేంద్రాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. కాకినాడ జిల్లాలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాల యొక్క పేర్లు కాకినాడలో జిల్లాలోని గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామంలోనిఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ, గవర్నమెంట్ ఐటీఐ కాలేజీ, టెక్నాలజీ కాలేజీ, మోహన్ కాలేజీ, ఐడీఏల్ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ, ఊా లక్ష్మి కాలేజీలలో ఉన్న 12 పరీక్షా కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, పరీక్షా ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లా పోలీసులు, గేట్ల వద్ద మహిళా అభ్యర్థులను మహిళా పోలీస్ కానిస్టేబుళ్లతో తనిఖీలు నిర్వాహించెటట్లు చూడాలని అదనపు ఎస్పీ పరిపాలన వీజీఏ భాస్కరరావుకి సూచనలు చేసారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్‌లను, స్థానిక పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించారు.

యోగాంధ్ర కార్యక్రమం

విశాలాంధ్ర - కాకినాడ : అంతర్జాతీయ యోగ దినోత్సవం-2025 పురస్కరించి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కలెక్టర్, కాకినాడ వారి సూచనల మేరకు సమాచార పౌర సంబంధ శాఖ జిల్లా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుండి 31వ తేదీ వరకూ స్థానిక రాజాటాంక్ ఆవరణలో జిల్లా రెడ్ క్రాస్ యోగా కేంద్రంలో ఉదయం 7.30 గంటల నుండి 8.30 గంటల వరకూ కాకినాడ జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు వారం రోజులు యోగ, ప్రణాయామ ప్రక్రియలలో శిక్షణా కార్యక్రమం ఐదవ రోజు ఆయుష్ యోగ గురు రామా పల్లవి శిక్షణలో ఐదవ రోజు విజయవంతంగా పూర్తి చేశారు.

పుట్టపర్తి సత్యసాయి రథానికి అపూర్వ స్వాగతం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్య సాయిబాబా వారి దివ్యపాదుకుల మాధుర్యంతో, భక్తి శ్రద్ధలతో నిండిన శ్రీ సత్య సాయి రద యాత్రకు శుక్రవారం ప్రతిపాడు లో భక్తులు ఘనస్వాగతం పలికారు. అనకాపల్లి జిల్లాలో ముగిసిన అనంతరం కాకినాడ జిల్లాలో ప్రారంభమైంది. తొలుత తుని పట్టణ వీధుల గుండా తేటగుంట, అన్నవరం, కత్తిపూడి, వజ్రకూటం ధర్మవరం గ్రామాల మీదుగా మండల కేంద్రమైన ప్రత్తిపాడులో సేవా సమితి వారు సత్యసాయి రథానికి స్వాగతం పలికి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ పురవీధుల్లో స్వామివారి రధాన్ని భజనలు హారతులు ఇస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ రథయాత్రలో పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 200మందికి మధ్యాహ్నం అన్న ప్రసాదం ఏర్పాటు చేసి స్వామివారి ప్రసాద, విభూతి, చిత్రపటాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆధ్యాత్మిక విభాగం సమన్వయకర్త కస్తూరి భాస్కర్, జిల్లా అధ్యక్షులు యార్ల గడ్డ గోవిందరాజులు, జిల్లా యూత్, విద్య, సేవ, ఆధ్యాత్మిక, వైద్య మరియు విద్యా జ్యోతి సమన్వయకర్తలు, పెద్దాపురం జోన్, కాకినాడ జోన్, కిర్లంపూడి జోన్, తుని జోన్ల కన్వీనర్లు, తుని, ప్రత్తిపాడు, కిర్లంపూడి సమితి సభ్యులు, బాల వికాస్ చిన్నారులు, ధర్మవరం వారి కోలాటం, మహిళలు తదితరులు పాల్గొన్నారు. సాయి భక్తులందరూ తెల్లని బట్టలు డ్రెస్ కోడ్ పాటించి రథం ముందు ర్యాలీగా కొనసాగారని శ్రీ సత్య సాయి సేవా సమితి ప్రత్తిపాడు కన్వీనర్ ఎస్వీఎస్ సూర్యనారాయణ తెలిపారు.

ఉగ్ర దాడులను నిరసిస్తూ ర్యాలీ

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : యు కొత్తపల్లిలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దేశంలో గతనెలలో జరిగిన ఉగ్రదాడులను నిరసిస్తూ యు కొత్తపల్లిలో సమైక్యత ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీని ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గురాల అప్పారెడ్డి మాట్లాడుతూ గత నెల 22వ తేదీన కాశ్మీర్లోని పహాల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో 26 మంది పర్యాటకులు మరణించారని, ఈ సందర్భంగా జరిగిన ఆపరేషన్ సింధూరిలో అనేకమంది సైనికులు సరిహద్దు ప్రాంత ప్రజలు మరణించారని కానీ ఇప్పటివరకు ఒక్క ఉగ్రవాదీని కూడా భారత ప్రభుత్వం పట్టుకోలేకపోయిందన్నారు. ఈ ర్యాలీలో సిపిఎం నాయకులు కాళ్ళ నాగేశ్వరరావు, కేవివి సత్యనారాయణ, జి వెంకటసుబ్బరెడ్డి, అంగర వాసు, సుబ్రహ్మణ్యం, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు సీపీఐ నేత డేగా ప్రభాకర్ లేఖాస్త్రం

- ముమ్మిడివరం నియోజకవర్గంలో నేడు ముఖ్యమంత్రి పర్యటన

- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అభివృద్ధికి కమిటీ ఏర్పాటుకు వినతి

విశాలాంధ్ర - అమలాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో శుక్రవారం జరగనున్న బంగారు కుటుంబం కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డేగా ప్రభాకర్ సీఎంకు శుక్రవారం లేఖాస్త్రం సంధించారు. జిల్లాల విభజన అనంతరం అంబేద్కర్ కోనసీమ జిల్లా 3 రెవెన్యూ డివిజన్ల కలిగి పూర్తి వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉందని, ఎటువంటి పారిశ్రామిక అభివృద్ధి లేద న్నారు. కాకినాడ పారిశ్రామిక కేంద్రంగా ఓడరేవు కలిగి అన్ని వసతులు కలిగి ఉందని తెలిపారు. తూర్పు గోదావరి (రాజమహేంద్రవరం) జిల్లా వాణిజ్య కేంద్రంగా విలసిల్లుతోందని. విమానా శ్రయం రోడ్డు కమ్ రైలుమార్గం ద్వారా రాకపోకలు సాగించే సామర్థ్యం కలిగిన జిల్లాగా ఏర్పాటైందన్నారు. ఇక అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎటువంటి కనీస సౌకర్యాలు లేని జిల్లాగా మారిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యా లయం అరకొర సౌకర్యాలతో నడుస్తోందని తెలిపారు. ముమ్మిడివరంలో ప్రభుత్వ కార్యాల యాలు అద్దె భవనాలలో నడుస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గానికి రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి పార్టీ జిల్లా ఇన్‌చార్జిగా జిల్లా సమస్యలను తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. కోనసీమకు ఒక పార్లమెంటు సభ్యుడు, రాష్ట్ర మంత్రి, ఆరుగురు గురు శాసన సభ్యులు, శాసన మండలి సభ్యుడు ఉన్నారన్నారు. సుదీర్ఘ కాలంగా కోనసీమ ప్రజల ఆకాంక్ష కోటిపల్లి - నర్సాపురం రైల్వేలైను నిర్మాణమన్నారు. దివంగత నేత జీఎంసీ బాలయోగి మానస పుత్రిక కోనసీమ రైల్వే లైన్ నిర్మాణం. కోనసీమ జేఏసీ పోరాట స్ఫూర్తి అయిన రైల్వే లైన్ నిర్మాణం నత్త నడకన సాగడాన్ని జిల్లా ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారనేది అక్షరసత్యమని పేర్కొన్నారు. కోనసీమ జిల్లా సమగ్ర అభివృద్ధిని కూటమి ప్రభుత్వం సాకారం చేయాలని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు టీడీపీ, జన సేనకు ఏక చంత్రాది పత్యం ఇచ్చాయన్నారు. అటువంటి జిల్లాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల కూనా రాలిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని అధ్యయనం చేసి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా పరిస్థితి పై సమగ్ర నివేదికను రూపొందించేందుకు కమిటీని వేసి అధ్యయనం చేయించాలని ప్రభాకర్ కోరారు.

విద్యారంగం సమస్యల పరిష్కారకై ఉద్యమిస్తాం

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకట్

విశాలాంధ్ర - ఆలమూరు : ఈనెల 31న కాత్రేనికోనలో జరిగే సీఎం పర్యటనలో భాగంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సమస్యలుపై వినతి పత్రం అందిస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకట్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఆలమూరులో జరిగిన జిల్లా కార్యవర్గం సమావే శంలో వెంకట్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెంటనే నిర్మించాలన్నారు. రాజోలు నియో జకవర్గం ఏఎఫ్టిటి విద్యా సంస్థలను ప్రభు త్వంలో విలీనం చేయాలని, కొత్తపేట నియోజక వర్గంలోని ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మించాలని,మండపేట నియోజకవర్గం కేశవరం గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మించాలని, రామచంద్రపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. అలాగే ఫీజు రీయింబర్స్మెంట్‌లు వస్తాయా లేదా తెలియకపోవ డంతో విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. జీవో నెంబర్ 77రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్‌తో పాటుగా హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మొటిక్ ఛార్జీలు విడుదల చేయాలన్నారు. వాటి పరిష్కారం కోసం ఉద్యమిస్తామని భవిష్యత్‌లో పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి రవి కుమార్, జిల్లా నాయకులు సతీశ్, సాయిరాం, సందీప్, నూకన్న ప్రసాద్, సుహాస్ పాల్గొన్నారు.

పకడ్బందీగా సీఎం పర్యటనకు ఏర్పాట్లు

-జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

విశాలాంధ్ర - కాత్రేనికోన : రాష్ట్ర సీఎం నారాచంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ విప్ ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు, ముఖ్యమంత్రి పర్యటనల కన్వీనర్ పెందుర్తి వెంక టేష్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ బి కృష్ణారావులతో కూడిన బృందం చెయ్యేరు గున్నేపల్లి హెలిపాడ్ ప్రజా వేదిక, చెరువు పూడికతీత పనులు, పార్టీ క్యాడర్ సమావేశ ప్రాంతాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీవోలు కె మాధవి, పి శ్రీకర్, డి అఖిల సర్వశిక్ష అభియాన్ సహాయ ప్రోగ్రాం కోఆర్డి నేటర్ జి మమ్మీ, ట్రాన్స్కో ఎస్సీ ఎస్ రాజబాబు, పంచాయతీరాజ్ ఎస్సీ పి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యు ఎస్ఎస్‌సి సిహెచ్ ఎన్వి కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగా సంజీవని

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమ వరం: ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని, శారీరక, మానసిక ఆరో గ్యానికి యోగ ఒక సంజీవని అని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అల్లూరి సీతారామ రాజు సాంస్కృతి కేంద్రం ప్రాంగణంలో యోగ అభ్యసన కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. సుమారు 150 మంది పాల్గొన్న కార్యక్రమంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం అభ్యాసన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను దిన చర్యగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, జిల్లా లేబర్ ఆఫీసర్ ఎ.లక్ష్మి, అల్లూరి సీతా రామరాజు సంస్కృతిక కేంద్రం అధ్యక్షులు సుబ్బరాజు, కార్యదర్శి చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు, సచివాలయసిబ్బంది, ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్,ఐపీఎస్



విశాలాంధ్ర - కాకినాడ : 30వ తేది సాయంత్రం కాకినాడ 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీలు చేసి, పోలీస్ స్టేషన్ పరిసరాలను, భవనమును పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిని మర్యాద పూర్వకంగా చూసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మహిళా సంబంధిత కేసులలో సత్వరం స్పందించి వారికి న్యాయం చేయాలని, పోలీస్ స్టేషన్‌లో వారికి న్యాయం జరుగుతుందనే మనోధైర్యం కల్పించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. పట్టణంలో రాత్రి గస్తీ, పెట్రోలింగ్ పెంచి దొంగతనాలు జరగకుండా నిరోధించాలని, అపరిచితులపై నిఘా పెట్టి, రాత్రులు అనవసరంగా తిరిగే వారిని నిరోధించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులలో దర్యాప్తు వేగంగా పూర్తి చేసి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. మహిళల పై మర్యాదగా ప్రవర్తించి భార్యాభర్తలు తగువులలో కౌన్సిలింగ్ నిర్వహించి, వారు తిరిగి కలసుకునే విధంగా చూడాలని సబ్ ఇన్స్పెక్టర్లను, సిబ్బందిని కోరారు.

97 మందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని ఒమ్మంగి శ్రీ భారతి విద్యానికేతన్ విద్యా సంస్థల ప్రాంగణంలో శుక్రవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. స్థానిక చేవల ట్రస్ట్, జేపీఎస్ మినిస్ట్రీస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో కంటి, డెంటల్, షుగర్, బీపీలకు సంబంధించి 97 మందికి వైద్య సేవలు వైద్యులు మౌనిక, మణికంఠ, భక్త ప్రదీప్ వైద్య బృందం వాసన్ ఐ కేర్ మోహన్, డయాబెటిస్ సెంటర్ సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో చేవల ట్రస్ట్ నిర్వాహకులు చెవల వెంకటరావు, చవల కామేశ్వరరావు, రాము, ఆనంద్, జువ్వల చక్రధర్ తదితరు పాల్గొన్నారు.

మల్లుల అనురాధ మృతి

- సీపీఐ, అరసం, మహిళా సమాఖ్యకు తీరని లోటు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్...

విశాలాంధ్ర-ఏలూరు: సీపీఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు సతీమణి, అరసం జిల్లా సమితి సభ్యురాలు, న్యాయవాది మల్లుల అనురాధ మృతి సీపీఐ, అరసం, మహిళా సమాఖ్యకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. అనురాధ సీపీఐ సభ్యురాలుగా అరసం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆయా సంఘాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తూ పార్టీ, ప్రజా సంఘాల అభ్యున్న తికి విశేష కృషి చేశారని కొనియాడారు. అనురాధ వామపక్ష భావజాలంతో అనేక కార్యక్రమాల్లో పాల్గొని ముందుండేవారన్నారు. పార్టీ కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొంటున్న అనురాధ ఆకస్మికంగా మృతిచెందడం విచారకరమని ఆమె మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూమి తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

జూన్ 2న మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం :పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడుసెంట్లు , ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గృహ నిర్మాణానికి ఐదు లక్షల మంజూరు చేయాలని కోరుతూ జూన్ రెండో తేదీన మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయా లని సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు పేదలకు ప్రజలకు పిలుపునిచ్చారు. జూన్ 2న రాష్ట్రంలో అన్ని మండల కేంద్రాలను ధర్నా చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. వ్యవసాయ తరుణం ఆసన్నమైందని, రైతులకు పెట్టుబడుల సాయం కింద ఇస్తా మన్న రూ.20వేలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. 90 శాతం సబ్సిడీతో రైతులకు ఎరువులు విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు.

ఆరోగ్య, ఆనంద స్వర్ణాంధ్రే లక్ష్యం

యోగా రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: ఆరోగ్య, ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆంక్షలకు అనుగుణంగా ఈ నెల 21న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమం జిల్లాలో ముందుకెళుతుంది. జిల్లా వ్యాప్తంగా ఇందుకు సంబంధించిన కార్యక్రమాలు జరుగుతున్నాయి.ప్రణాళిక ప్రకారం జిల్లాలో దాదాపు 8 లక్షల మందికి యోగాను చేరువ చేసేందుకు కృషిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు.ఇందులో భాగంగా ఇప్పటికే 4.18 లక్షల మంది తమపేర్లు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇప్పటికే యోగాభ్యాసకులకు శిక్షణ అందించేందుకు 6.226 మంది శిక్షకులు నమోదై యున్నారన్నారు. మండల స్థాయిలో గ్రామ, వార్డు,సచివాలయాల పరిధిలో కనీసం 50 మందికి యోగాను చేరువచేసేందుకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టబడుతుంది. జూన్ 21 వరకు జిల్లాలోని ప్రతి గ్రామ, పట్టణాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.జిల్లాస్థాయి వరకు యోగా సంబంధిత వివిధ స్థాయిల్లో వివిధ పోటీలను నిర్వహించడం జరుగుతుంది. జిల్లాస్థాయిలో ఉత్తమంగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందన్నారు.

చంద్రబాబు పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో క్షేత్రస్థాయి పరిశీలన

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర - అమలాపురం : నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటనకు సంబంధించి పటిష్ట మైన అన్ని ఏర్పాట్లు జరిగాయి. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఏర్పాట్లను పరిశీలించాక మీడియాకు తెలిపారు. శుక్రవారం మంత్రి సుభాష్ ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, అదనపు ఎస్పీ ప్రసాద్, ఇతర జిల్లా అధికారులు, ప్రభుత్వ విప్ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్న రాజప్ప, ముఖ్యమంత్రి పర్యటనల కన్వీనర్ పెందుర్తి వెంకటేష్, పోలీస్ పోలీసు అధికారులతో కూడినబృందం హెలిపాడ్, ప్రజావేదిక, చెరువు పూడికతీత పనులు, పార్టీ క్యాడర్ సమావేశ ప్రాంతాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై విధులు, బాధ్యతలు కేటాయించిన అధికారులకు పలు జాగ్రత్తలు తీసుకుని, అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు జారీ చేశారు. మంత్రి సుభాష్ వెంట పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, రెవిన్యూ, సర్వశిక్ష అభియాన్, ఏపీ ట్రాన్స్కో, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యు వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.